క్లుప్తంగా

ఇళ్ల మధ్య యమపాశాలు



చిట్టిగిద్దలో ఇళ్లకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం

నవాబుపేట: ఇళ్లను ఆనుకొని విద్యుత్ స్తంభాలు ఉండడంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులెవరూ అటు వైపు కన్నెత్తి చూడటం లేదని మండి పడుతున్నారు. మండల పరిధిలోని చిట్టిగిద్ద గ్రామంలో ఇళ్లను ఆనుకొని విద్యుత్‌స్తంభాలు ఉండటంతో నిత్యం భీతిల్లుతున్నామని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయం విద్యుత్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేదని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి తక్షణమే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

దంత శిబిరానికి స్పందన



విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యుడు

ధారూరు: స్థానికంగా శ్రీభారతి విద్యామందిర్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత దంత వైద్య శిబిరాన్ని పీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల రఘువీరారెడ్డి ప్రారంభించారు. జవహర్ బాల్ మంచ్ జిల్లా అధ్యక్షుడు రఘుగౌడ్ ఆధ్వర్యంలో శ్రీసాయి దంతవైద్య కళాశాల సహకారంతో శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు విజయభాస్కర్‌రెడ్డి, లింగనపల్లి అశోక్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ టీచర్‌కు పీహెచ్‌డీ పట్టా



నర్సమ్మను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

దుద్యాల్: మండల పరిధిలోని చెట్టుపల్లి తండా శివారులో ఉన్న కేజీబీవీలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న నర్సమ్మ పీహెచ్‌డీ పట్టా పొందారు. ఈ మేరకు ఆమెను పాఠశాల ఎస్‌ఓ రాధిక, తోటి సిబ్బంది మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ.. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో దళిత సాహిత్యం అనే అంశంపై హిందీలో పరిశోధనలు చేసి పట్టా పొందినట్లు తెలిపారు. చిన్నతనం నుంచే ఉన్నతమైన విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ముందుకు సాగానన్నారు. ఈమె స్వస్థలం నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండల వెన్నచెర్ల గ్రామం కాగా మండల పరిధిలోని కేజీబీవీలో హిందీ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి

వికారాబాద్ టౌన్ సీఐ నాగరాజు



విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న సీఐ, సంస్థ ప్రతినిధులు

అనంతగిరి: విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని వికారాబాద్ పట్టణ సీఐ నాగరాజు అన్నారు. మండల పరిధిలోని ఎర్రవల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాలలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కిట్స్ (బ్యాగులు, మ్యాట్లు, చెప్పులు) పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి పాఠశాల దశలోనే క్రమశిక్షణ నేర్చుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కష్టపడి మిమ్మల్ని చదివిస్తున్నారని, మీరు ఉన్నతంగా చదివి మంచి పేరు తేచ్చుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ప్రకాష్ కుమార్, కో ఆప్షన్ సభ్యుడు జాఫర్, మాజీ సర్పంచ్ సుభాన్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ లక్ష్మణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాండు రంగయ్య, సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ సంజీవ్ రావు, గ్రామ పెద్దలు పెంటయ్య, రామేశ్వర్, రవీందర్, హైమద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో ఇటీవల మృతి చెందిన యాదమ్మ(36) కుటుంబానికి మున్సిపల్ కౌన్సిలర్ సాయి ప్రసన్న, యువజన కాంగ్రెస్ నేత ఎం.కృష్ణంరాజు రూ.5,500 ఆర్థికసాయాన్ని మంగళవారం అందించారు.

స్థానిక పోరుపై సందిగ్ధం

- జీసీ కులగణన తర్వాతే ఎన్నికలకు ఆస్కారం
- ఆశావహుల్లో ఉత్కంఠ
- ఎనిమిది నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక పాలన



గ్రామ పంచాయతీ కార్యాలయం

పరిగి: స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రజల్లో సందిగ్ధత ఏర్పడింది. రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. బీసీ కులగణన చేపట్టిన తరువాతే ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెప్పడంతో మరింత ఆలస్యమయ్యే అవకాశాలున్నాయి. ఎనిమిది నెలలుగా పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. కేంద్రం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో గ్రామాల్లో సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోయాయి. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం గత ఫిబ్రవరి 2న పూర్తయింది. కాగా ఎన్నికలను ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించలేదు. పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమించి చేతులు దులుపుకొంది. దీంతో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదంటూ స్థానికులు ఆరోపిస్తున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా జరగడం లేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన 15వ ఆర్థిక సంఘం నిధులు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో ప్రత్యేకాధికారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రిజర్వేషన్ల మార్పుపై చర్చ

జిల్లాలో మొత్తం 19 మండలాలు ఉండగా 565 గ్రామ పంచాయతీలున్నాయి. 2018లో గత ప్రభుత్వం నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకువచ్చింది. ఈ చట్టం ద్వారా పంచాయతీలు, మండల, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీల్లో రిజర్వేషన్లను పదేళ్లు విధించారు. రోటేషన్ పద్ధతిన మార్చాలని పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రంలో కొన్ని కొత్త మండలాలతో పాటు, గ్రామ పంచాయతీలు కూడా ఏర్పడ్డాయి. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్లను మార్చుతారా లేదనే చర్చ జోరుగా సాగుతోంది. రిజర్వేషన్లు మార్చాలంటే పంచాయతీరాజ్ చట్ట సవరణ చేస్తేనే గాని ఎన్నికలు నిర్వహించే ఆస్కారం లేదు. దీంతో ఎన్నికలు మరింత ఆలస్యమవుతాయని విశ్లేషకులు చెబుతున్నారు.

ఎన్నికలు మరింత ఆలస్యం

రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో బీసీల కులగణన చేస్తామని హామీ ఇచ్చింది. ఈ మేరకు అసెంబ్లీలో ఆమోదం కూడా పొందింది. ఆ తర్వాత బీసీ కులగణన చేపట్టేందుకు రంగం సిద్ధం చేయగా పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో కులగణన ఆదిలోనే హంసపాదులా మారింది. ప్రస్తుతం కులగణన చేపట్టి రిజర్వేషన్‌లు తీసుకురావాలంటే మరింత సమయం పట్టే అవకాశం ఉంది. మండల, జిల్లా పరిషత్ పాలకవర్గాల పదవీకాలం సైతం గత జులైలో పూర్తయింది. అక్కడ కూడా ప్రత్యేక అధికారుల పాలనను ప్రభుత్వం తీసుకువచ్చింది. రిజర్వేషన్‌ల ప్రక్రియ పూర్తయితేనే ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసి తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఎదురుచూస్తున్నారు. బీసీ కులగణన ప్రకారం ఎన్నికలకు వెళ్లినట్లయితే మాత్రం మొత్తం స్థానికసంస్థల సమరం వచ్చే ఏడాదిలోనే జరుగుతాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

ట్రాఫిక్ సమస్య సృష్టించొద్దు

చిరు వ్యాపారులకు పోలీసుల హెచ్చరిక



చిరు వ్యాపారులతో సమావేశమైన పట్టణ సీఐ, మున్సిపల్ కమిషనర్

తాండూరు టౌన్: పట్టణంలోని ప్రధాన మార్గాల్లో రోడ్లపై వ్యాపారాలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ సంతోష్ కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పలువురు చిరు వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. స్థానిక ఇందిరాచౌక్ నుంచి రైల్వే స్టేషన్ వరకు రోడ్లకు ఇరువైపులా, వాహనదారులకు ఇబ్బంది కలిగేలా వ్యాపారం చేస్తున్నారన్నారు. పలు తోపుడు బళ్లు, రోడ్డుకు ఇరు వైపులా చిరు వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నందున రోడ్లపై వ్యాపారాలు చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణ సీఐతో పాటు మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలంటూ పట్టణ పోలీసులు వ్యాపారులకు మంగళవారం నోటీసులు జారీ చేశారు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నేరాల అదుపు, నిందితుల గుర్తింపులో సీసీ కెమెరాలు సహాయ పడతాయన్నారు. పట్టణంలోని పలు హోటళ్లు, కిరాణా, మొబైల్, స్వీట్ దుకాణాలు, ప్రైవేటు ఆస్పత్రులతో పాటు పలు దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. అందరూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

స్వచ్ఛ భారతాన్ని నిర్మిద్దాం



పారిశుద్ధ్య పనుల్లో కోర్టు సిబ్బంది, న్యాయవాదులు

పరిగి: పట్టణ కేంద్రంలోని కోర్టు ఆవరణలో మంగళవారం కోర్టు సిబ్బంది, న్యాయవాదులు కలిసి స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. కోర్టు పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ఇన్‌చార్జి సూపరింటెండెంట్ జ్యోత్స్న మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఎప్పుడూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరికీ వారు స్వతహాగా శుభ్రంగా ఉంచుకోవడంతో దేశం మొత్తం శుభ్రంగా ఉంటుందన్నారు. మహాత్మాగాంధీ కలలు కన్న పరిశుభ్ర భారతావనిని స్వచ్ఛ భారత్ ద్వారా నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో బెంచ్ క్లర్క్ అనిల్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, న్యాయవాదులు భక్తకుమార్, వెంకట్‌రాములు, అలీముద్దీన్, రాజేందర్‌గౌడ్, యాదయ్య తదితరులు పాల్గొనారు.

‘పర్యావరణ’ పోటీల్లో విద్యార్థుల సత్తా



ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

బొంరాస్‌పేట: జిల్లా అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ వన్యప్రాణుల వారోత్సవంలో మండల కేంద్రానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ చాటారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని ఝాన్సీ వ్యాసరచనలో మొదటి బహుమతి, రెండో బహుమతి ఆర్తి, చిత్రలేఖనంలో మొదటి బహుమతి పవన్‌కుమార్, రెండో బహుమతి చైతన్య సాధించారు. వీరికి ప్రత్యేకాధికారి జ్ఞానేశ్వర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు, బహుమతులు అందించారు. ఎంఈఓ హరిలాల్, ఉపాధ్యాయులు మల్లయ్య, అనిల్‌కుమార్, బాకారం చంద్రశేఖర్, వెంకటయ్య అభినందించారు.

ప్రతిభకు సన్మానం



మురళిని సన్మానిస్తున్న నాయకులు

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతానికి చెందిన యువతలో ఎంతో నైపుణ్యం దాగి ఉందని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు కుమ్మరి స్వామి అన్నారు. డీఎస్సీ ఫలితాల్లో భాగంగా మండల కేంద్రానికి చెందిన మురళి ఏకకాలంలో పీడీ, పీఈటీ ఉద్యోగాలను సాధించారు. కాగా మంగళవారం స్వామి సైన్యం ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో మురళిని సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు గణేష్‌ముదిరాజ్, కుమ్మరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు



లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందిస్తున్న నేతలు

కుల్కచర్ల: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ అధ్యక్షుడు ఎల్పటి అశోక్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం చౌడాపూర్ మండలం మల్కాపూర్ గ్రామంలో లబ్ధిదారులకు గ్యాస్ ప్రొసీడింగ్స్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.500లకే గ్యాస్‌ను అందిస్తుందన్నారు. అందుకు ధ్రువపత్రాలన్ని పంపిణీ చేస్తున్నామన్నారు. రానివారికి కూడా త్వరలోనే వచ్చేందుకు అవసరమైన ప్రక్రియను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభులు, నాయకులు వెంకటయ్యగౌడ్, దామోదర్‌రెడ్డి, నరసింహనాయక్, గోపాల్, రాము, రాజేందర్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి



మాట్లాడుతున్న పట్టణ మాజీ ఉప సర్పంచ్ గౌసన్

కొడంగల్: చెరువులు, కుంటల్లో నిర్మించిన అక్రమ నిర్మాణాలను కూల్చి వేయాలని మైనార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మాట్లాడారు. అక్రమ నిర్మాణాలను కూల్చి వేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన హైడ్రాను అభినందించారు. రాజకీయ నాయకులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని విమర్శించారు. సమావేశంలో పట్టణ మాజీ ఉప సర్పంచ్ ఎస్ఎం గౌసన్, నాయకులు ఆసిఫ్‌ఖాన్, సయ్యద్ హమీద్, సిరాజుద్దీన్ పాల్గొన్నారు.

స్వచ్ఛమైన నీటిని అందించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

దోమ: ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగు నీరును అందించాలని ఎంపీడీఓ మహేశ్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో మల్టీపర్పస్ ఉద్యోగులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో హ్యాండ్ పంపులు, ప్లంబింగ్, బోరు మోటార్ల రిపేరు, నీటి శుద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కిరణ్, ఎంపీఓ సోమలింగం, మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రబీ సాగు.. వేరుశనగ జోరు

దుద్యాల్: రబీ సాగు పనుల్లో మండలంలోని అన్నదాతలు నిమగ్నమయ్యారు. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కువ మంది పొలాలను చదును చేసి వేరుశనగ విత్తనాలు విత్తుకుంటున్నారు. దీంతోపాటు వాతావరణం సైతం అనుకూలించడంతో రైతన్నలు వడివడిగా వ్యవసాయ పనుల్లో చెమటోడ్చుతున్నారు. కొందరు రైతులు ట్రాక్టర్ల సహాయంతో విత్తనాలు విత్తుకుంటుండగా.. మరికొందరు ఎద్దుల నాగళ్లతో పని కానిస్తున్నారు. రబీలో అత్యధిక రైతులు వేరుశనగ పంట సాగుకు ఆసక్తి చూపుతున్నారు.



నాగళ్లతో విత్తనాలు విత్తుకుంటున్న రైతులు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి



పీహెచ్‌సీలో కార్మికులకు వైద్య పరీక్షలు చేయిస్తున్న ఎంపీడీఓ

మోమిన్‌పేట: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలు శుభ్రంగా ఉండాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో స్వచ్ఛతా హి సేవ పక్షోత్సవాల సందర్భంగా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అనారోగ్యంతో ఆస్పత్రికి వచ్చే రోగులకు ప్రశాంత వాతావరణం కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ తన పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత తప్పనిసరి అన్నారు. ఆస్పత్రిలో మోమిన్‌పేట పంచాయతీ కార్మికులకు వైద్య పరీక్షలు చేయించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి సుజల, రషీద్, ఎంపీఓ యాదగిరి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అనంతగిరి: జెడ్పీ బాలికల పాఠశాల వేడుకలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల, విద్యార్థినులు



తాండూరు: బతుకమ్మలతో చిన్నారుల సందడి



పరిగి: మిట్టకోడూర్‌లో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినులు



కొడంగల్: కృష్ణవేణి పాఠశాలలో బతుకమ్మ వేడుకలు

ఒక్కొక్క పువ్వై.. బతుకమ్మ కొలువై

తెలంగాణ విశిష్టతను నలు దిక్కులా చాటి చెప్పే బతుకమ్మ పండగకు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు వేదికయ్యాయి. మంగళవారం దసరా సెలవుల నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ముందస్తుగా పూల పండగ నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అందంగా పూలను అలంకరించి గౌరమ్మను ప్రతిష్టించారు. ‘ఒక్కొక్క పువ్వేసి చందమామ’ అంటూ పాటలు పాడుతూ సంతోషంగా గడిపారు. జిల్లా వ్యాప్తంగా వికారాబాద్, తాండూరు, పరిగి, కొడంగల్ నియోజకవర్గాల్లోని ఆయా పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి.

– సాక్షి, నెట్‌వర్క్



తాండూరు రూరల్: మోడల్ స్కూల్లో బతుకమ్మలతో అధ్యాపకులు, విద్యార్థినులు



తాండూరు టౌన్: గురుకుల పాఠశాలలో బతుకమ్మ పేర్చుతున్న టీచర్లు, విద్యార్థినులు



బొంరాస్‌పేట: నాగిరెడ్డిపల్లి పాఠశాలలో..



కుల్కచర్ల: గండిచెరువు తండాలో..



అనంతగిరి: ఏసీఆర్ కళాశాలలో బతుకమ్మ సంబురాలు



బషీరాబాద్: రెడ్డిఘణాపూర్ జెడ్పీ పాఠశాలలో హెచ్‌ఎం ఆధ్వర్యంలో..



దుద్యాల్: పాఠశాల ఆవరణలో..



తాండూరు టౌన్: కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..